# ఆకలి

"అమ్మా ! ఆకలేస్తుందే " అన్న మాట వినిపించేసరికి మాలతి కలం ఆగిపోయింది. తను దేనిగురించి వ్యాసం రాయాలనుకుందో అదే-అదే మాట. మాలతి తల ఎత్తి చూసింది పనిమనిషి మహాలక్ష్మి చీరకొంగు పట్టుకొని ఏడుస్తూ అడుగుతోంది—మూడేళ్ళు నిండని ముత్యాలు. ముత్యాన్ని చూసేసరికి జాలేసింది మాలతికి. "అది ఈరోజు అన్నం తిన్నట్లు లేదు ఆకలితో దాని ముఖం వడిలిపోయింది" మాలతి కలమూ కాగితమూ ప్రక్కన పెట్టి వంటింట్లోకి పరుగెత్తింది. అమ్మా ! ముత్యాలుకి ఆకలేస్తూందట."

"నన్నేం చెయ్యమంటావమ్మా?" అంది రాజేశ్వరమ్మ.

"దానికి ఒక రొట్టె ఇవ్వు"

"ఎలా ఇవ్వను తల్లీ ! అందరికీ తలో నాలుగు రొట్టెలుచేసి మూతపెట్టాను. దానికి మరెలాగివ్వడం ? మిగిలితే రేపిద్దాములే" రాజేశ్వరమ్మగారి జవాబు మాలతికి తృప్తి కలిగించలేదు. ఈరోజు ఆకలితో అది గిలగిల లాడుతూ ఉంటే మనం రేపు ఇస్తే ఎలా? ఇప్పుడెలా అయినా దాని ఆకలి తీర్చాలి అనుకుంది. "అమ్మా ! నా నాల్గింటిలో ఒకటి ముత్యాలకిస్తాను. ,,అమ్మ మాట కోసం ఎదురు చూడకుండానే రొట్టెల పళ్ళెం మీద కప్పివున్న విస్తరితీసి ఓరొట్టె తీసుకుని పెరటిలోకి పరుగెత్తింది మాలతి. ఆకలికి ఏడుస్తున్న ముత్యాలు చేతిలో రొట్టె పెట్టింది. మహాలక్ష్మి మాలతివైపు కృతజ్ఞతాపూర్వకంగా చూసింది. తనకు ఆకలి మండిపోతున్నా, తన కూతురు ఆకలి తీర్చినందుకు మాలతిని

మనసులోనే దీవించింది. మాలతి తృప్తిగా నవ్వుకుంది. ముత్యాలు ఆకలి తీర్చగలిగాను అనుకుంటూ మళ్ళీ వ్యాసం రాయడం ప్రారంభించింది. కాని, మరింత పెద్దగా ఏడుస్తోంది ముత్యాలు. మాలతి ఆశ్చర్యంగా ముత్యాలువైపు చూసింది. నేల మీద పడి దొర్లుతూ "కాకి కాకి ఎత్తుకుపోయింది" అంటూ ఏడుస్తోంది. తోమిన గిన్నెలు లోపల పెట్టటానికి వెళ్ళిందేమో మహాలక్ష్మి అక్కడ లేదు. ఆ పసిదాని ఏడుపుకు మాలతి హృదయం ద్రవించింది. ముత్యాలు చేతిలో రొట్టెను ఎగరేసుకుపోయిన కాకిని తిట్టుకుంది ముత్యాలుని దగ్గరకు తీసుకొని "ఏడకే ముత్యాలూ! రేపు నీకు పెడతాలే ఆ కాకి వస్తే గట్టిగా కొట్టిద్దాంలే కర్రతో" ముత్యాలును ఊరుకోపెట్టడానికి ప్రయత్నిస్తోంది మాలతి. కమ్మని మాటలతో కబుర్లతో కడుపు మంట తీరదు. అందుకే ఏడుపు మానలేదు ముత్యాలు పని ముగించి వచ్చిన మహాలక్ష్మితో "చూడు మహాలక్ష్మి! పాడు కాకి దీని చేతిలో రొట్టె ఎగరేసుకు పోయింది." మహాలక్ష్మి మాలతి మనసు గాయపడేలా అదోలా నవ్వింది.

"పిచ్చి మాలతమ్మ! ఎప్పుడూ మాలాంటి పేదల అదృష్టమింతేసమ్మా! ఏ పూట మా కడుపులు పూర్తిగా నిండాయి! పిల్లోళ్ళు ఆకలికి ఏడుస్తారు. ఆకలిని అణచుకొని పెద్దోళ్ళం బ్రతుకుతాము" మహాలక్ష్మి మాటలలో దైన్యం మాలతి హృదయాన్ని మరింతగా కలచివేసింది. మాహాలక్ష్మి అన్నది నిజమే. మానవుడు ఆకలికి బానిస. తన ఆకలి తనలోనే అణుచుకుంటాడు. అలా కాకపోతే ఓ మనిషి మరో మనిషిని పీక్కొని తినేవాడేమో. మాలతి

చుట్టూ ఆలోచనలు ముసురుకుంటున్నాయి. చీకటి పడింది. ,,ఈ పెరటిలో ఏం చేస్తున్నావు" అన్న, అన్నయ్య మాటకు ఉలిక్కిపడి లోపలికి వెళ్ళిపోయింది.

మాలతి మౌనంగా టిఫిన్ చేస్తోంది. మరో రొట్టె కావాలి అని మారాం చేస్తోంది మాలతి చెల్లి జ్యోతి. "ఇంక లేవమ్మా ! ఇలా అల్లరి చేస్తే ఎలా ? నాన్నగారూ అన్నయ్య అందరూ ఇంకా తినాలిగా" అన్నారు రాజేశ్వరమ్మగారు. జ్యోతి చిన్న పిల్లే అయినా ఏ విషయానికీ పేచీ పెట్టదు. ఆడుకునేందుకు మంచి మంచి బొమ్మలు కావాలని, అందరిలా మంచి మంచి గౌనులు కావాలనీ ఎప్పుడూ అడగదు. ఈ రోజు ఎంత ఆకలి వేస్తోందో మరో రొట్టె కావాలని ఏడుస్తోంది చిన్న పిల్ల. ఆకలికి తాళగలదా ? ఆలోచిస్తూ తన ప్లేటులోని రొట్టె జ్యోతి చేతిలో పెట్టి మాలతి టిఫిన్ ముగించింది. కాని ఇంకా ఆకలిగానే ఉంది తనకు. కుజాలో నుంచి రెండు గ్లాసుల మంచినీళ్ళు తీసుకొని తాగింది. ఎలాగైనా ఈ రోజు వ్యాసం పూర్తిచేయాలనుకుంది. వీధి వరండాలో కూర్చొని కలం కాగితం చేతిలోకి తీసుకుంది. మాలతి ప్రఖ్యాత రచయిత్రి కాకపోయినా ఆమె కథలూ వ్యాసాలూ తరచుగా పత్రికల్లో అచ్చవుతూ ఉంటాయి. చదివిన వారంతా రచయిత్రిగా మాలతికి మంచి పేరు, భవిష్యత్తు ఉంది అనుకుంటూ ఉంటారు. మాలతి తండ్రి ఓ ఆఫీసులో చిన్న ఉద్యోగం చేస్తున్నాడు. అతని ఆదాయం కుటుంబ పోషణకు సరిగా సరిపోదు. అందుకే మాలతి చదువు పదవ తరగతితోనే ఆగిపోయింది. సహజంగా

సాహిత్యా అభిలాషకల మాలతి, మొదట కాలక్షేపానికే రాయటం మొదలు పెట్టినా తర్వాత రచయిత్రి కాగలిగింది తన రచనల ద్వారా కుటుంబానికి ఆర్థికంగా కాస్త సాయపడ గలుగుతున్నందుకు అప్పుడప్పుడు మాలతికి ఆనందంగానే ఉంటుంది మాలతి వ్యాసం వ్రాస్తూనే ఉంది. ఆలోచనలేవీ రావడంలేదు. కలం ప్రక్కన పెట్టేసి ఆలోచిస్తూ కూర్చుంది తన కీరోజు పూర్తిగా ఆకలి తీరలేదు. సమాజంలో ఎవరి ఆకలి పూర్తిగా తీరుతూంది? ఎంతమంది తమ ఆకలి పూర్తిగా తీర్చుకోగలుగుతున్నారు ? అందరూ ఈ ఆకలికి అల్లాడేపో_ యేవారే ! ఈ ఆకల అంతరించే మార్గమే లేదా ? ఆవేశంగా కలం చేతిలోకి తీసుకోని మళ్ళీరాయటం మొదలు పెట్టింది. మాలతి ప్రక్క ఇంటి దగ్గర నుంచి బిచ్చగాడి కంఠం విని_ పించింది. „కాస్త అన్నం పెట్టండి తల్లీ రెండు రోజుల నుంచి గంజినీళ్ళయినా నోట్లో పోసుకోలేదు. పాడు ఆకలి నా ప్రాణాలు తోడేస్తూంది. మీ పుణ్యం ఉంటుంది. కాస్త అన్నం పెట్టండి తల్లి" బిచ్చగాడి మాటలు స్పష్టంగా వినిపించాయి మాలతికి. ఇప్పుడేం కాదబ్బీ రాత్రి వేళ ఏమిటి గొడవ" పక్కింటి అమ్మాయి విసుక్కోవడం కూడా వినిపించక పోలేదు మాలతికి. బిచ్చగాడు అతి దీనంగా బ్రతిమాలుకుంటున్నాడు. ఎదురింటి బామ్మగార్కి జాలే_ సిందేమో మరి. "ఆలారా నాయనా అన్నం పెడతా" అంటూ పిలిచేరు. అప్పుడే తన ఆకలి తీరిపోయినట్టుగా సంతోషించి ఒక్క అంగలో ఆ ఇంటివేపు నడిచేడు. కాస్త అన్నం తెచ్చి బిచ్చగాడి జోలి పాత్రలో వేసారు బామ్మగారు. పాత్ర తీసుకొని మాలతి ఇంటి దగ్గరకువచ్చి "అమ్మా చారు నీళ్ళ

ఉంటే పొయ్యి తల్లీ" అన్నాడు మాలతిని చూస్తూ. వంటింట్లోకి వెళ్ళి కాస్త పులుసు తెచ్చి ఆ బిచ్చగాడికి ఇచ్చింది మాలతి.

"పంపు దగ్గర కాళ్ళూ చేతులూ కడుక్కొస్తానమ్మా" అంటూ మాలతికి ఎదురుగా ఓ అరుగుమీద ఓ వారకు తన పాత్ర ఉంచి వెళ్ళాడతను. మాలతి చూస్తూ ఉండగానే ఘోరం జరిగిపోయింది. తను ఏమీచేయలేని అశక్తురాలయి పోయింది. తను ఎంత అదిలించబోయినా పాడు కుక్క బిచ్చగాడి అన్నం తినేసింది. పదేపదే బిచ్చగాడి దీనవదనం గుర్తుకురాగా ఆలోచిస్తూ మంచంమీద పడుకుంది మాలతి. ఆమె కళ్ళలో నీళ్ళు తిరిగాయి. పాపం అతనికి మళ్ళా ఆకలే మిగిలి ఉంటుంది. ఇంత రాత్రి ఇక ఎన్ని వీదులు తిరుగు తాడు ? తిరిగినా ఇక ఎవరు అన్నం పెడతారు? ఈ ఆలో- చనలను భరించలేకపోయింది మాలతి ఎప్పుడు నిద్రపట్టే సిందో తెలియదు కాని మాలతికి మెలకువ వచ్చేసరికి ఎనిమిది గంటలైంది.

"అరే ! బాగా తెల్లరిపోయిందే ! నేను వ్యాసం పూర్తి చేయకుండానే నిద్రపోయానే" అనుకుంటూ తన మంచం మీద చిందరవందరగా పడి ఉన్న కాగితాలు జాగ్రత్తగా మడతబెట్టి టేబుల్ పైన పెట్టింది. స్నానంచేసి కాఫీ తాగుతోంది మాలతీ, "అక్కయ్యా ఈవార్త చూసావా" అంటూ పేపరు పట్టుకొని మాలతి దగ్గరకు వచ్చేడు తన తమ్ముడు మధు. మధు చేతుల్లోంచి పేపరు తీసుకొని చదివిన మాలత నిశ్చేష్ఠురాలపోయింది. ఆకలి బాధ భరించ

లేక ఒక స్త్రీ తన ముగ్గురు పసికూనలతో ఆత్మహత్యచేసుకుంది. మాలతి ఆలోచిస్తూ అలాగే ఉండి పోయింది. అమ్మ పిలుపు వినిపించడంతో తేరుకొని వంటిట్లోకి వెళ్ళింది. "వసంతా పక్కింటి వాళ్ళ ఇంటికివెళ్ళి చక్కెర తీసుకురా అమ్మా ! షష్టు తారీఖు రాగానే ఇచ్చేద్దాం" అని మాలతి చేతికి ఓ ఖాళీ కప్పు అందించింది రాజేశ్వరమ్మగారు.

మాలతి చూస్తూనే "హల్లో మాలతీ ? ఎన్నాళ్ళకు కనిపించేవే అసలు రావడమే మానేసావు. అవునులే రచయిత్రివి అయిపోయావుగా" అందీ వసంత నవ్వుతూ. "నన్నూ మాట్లాడనివ్వవా ? అలా ఆగకుండా మాట్లాడేస్తావు పెంకిపిల్లా" అంటూ భుజం తట్టింది. అత్తగారు "అమ్మాయీ వసంతా ! పిల్లాడు ఏడుస్తున్నాడమ్మా" అన్నారు. వసంత వంటిట్లోకి వెళ్ళి పిల్లాడిని ఎత్తుకొని మాలతి దగ్గరకువచ్చింది వసంత కొడుకు ముద్దొస్తున్నాడు. చాలాబొద్దుగా ఆరోగ్యంగా ఉన్నాడు. "బాబు చాలా బాగున్నాడే వసంతా" అంటూ వాడి పాలబుగ్గలు ముద్దుపెట్టుకుంది. ఆకలేస్తుందేమో అంటూ పాలగ్లాసు వసంత చేతికి అందించారు అత్తగారు. వసంత మాలతితో ఏవేవో కబుర్లు చెబుతూ బాబుకి పాలు పడుయుంది. "వసంతా ! మా అమ్మ కొద్దిగా చక్కెర అడిగి తీసుకు రమ్మంది" అంది నెమ్మదిగా మాలతి. వంటిట్లోకి వెళ్ళవే మా అత్తగారు ఇస్తారు. మాలతి వంటిట్లోకి నడచింది . ఇంకో పసిపిల్లాడి ఏడుపు మాలతికి వినిపించిది. ఎంతో సేపటి నుంచి ఏడ్చినట్లు ఏడ్చి మరి ఏడ్వలేక బొంగురుపోయినట్లు ఉంది వాడి ఏడ్పు మాలతి పెరట్లోకి వెళ్ళి చూసింది. చిరిగిన చాపముక్క మీద పిల్లాడిని పడేకి

అంట్లు తోముతోంది. వసంతా వాళ్ళ పనిపిల్ల. వాడు కాళ్ళూ చేతులూ విసురుకుంటూ తల్లి వేపు చూస్తూ ఏడుస్తున్నాడు "తీసి ఎత్తుకో" అప్రియత్నంగానే అంది మాలతి. నీళ్ళు నిండిన కళ్ళతో మాలతి వేపు చూస్తూ ఎత్తుకొని "నేనేంటి చేస్తానమ్మా. పిల్లోడు ఆకలికి ఏడుస్తున్నాడు" మాలతి అదిరిపడింది. ఏమిటో తను వ్యాసం వ్రాయాలనుకున్న దగ్గరనుంచి తన చుట్టూ ఉన్న ప్రపంచంలోనే ఎంత ఆకలి బాధను చూస్తోంది. 'ఏయ్ ! మాలతీ ! అక్కడ నిలబడ్డా-వేమిటే ?" అంటూ వచ్చింది_వసంత. పిల్లాడి చుట్టూ మూడుసార్లు తిప్పి దిష్టి తీసి తన మనసులో ఏవేవో అను కుంటూ ఓ గ్లాసు పాలు నేలపై ఒంపేసింది. మాలతి విస్తుపోయింది. చిక్కనిపాలు అలా మట్టిపాలు చేస్తుంటే మాలతికి వళ్ళు మండిపోయింది. 'ఈ పాలకోసమే కదా సీతాలు కొడుకు ఏడుస్తున్నడి. అవి పాలే అని వాడికి తెలిస్తే పాకివెళ్ళి మట్టిలో కలసిపోతూన్న పాలే తాగేసే వాడేమో! వాడి ఆకలి గుక్కెడు పాలతో తీర్చలేని వసంత, గ్లాసుడు చిక్కటి పాలని దిష్టి అంటూ తిరగబోసేసింది. ఈ మను_ష్యులలో ఎంత మూర్ఖత్వం' అనుకుంది మాలతి. "ఏమిటి ఆలోచిస్తున్నావే ? లోపలికి పోదాంపద" మాలతి చేయి పుచ్చుకొని నడిచింది వసంత. "వసంతా నిన్ను ఓ మాట అడుగుతాను".

"అడగవే !" అంది బాబును ఉయ్యాలలో పడుకో బెడుతూ వసంత.

"అదే ! వసంతా ! నువ్వలా పాలెందుకు ఒలక_బోసినట్టు ?"

"అదేమిటే, బాబుకు దిష్టి తగిలినట్టుందని. మా అత్తగారు ఓగ్లాసుడు పాలు దిష్టి తీసి తిరగబోసెయ్య మన్నారు"

"నువ్వలాగే చేసావు" వసంత మాట పూర్తిచేసింది మాలతి.

"ఇంతకూ ఎవరి దిష్టి అంటావు" అడిగింది మాలతి

"అదేనే పనిపిల్ల సీతాలు లేదూ! దాని కొడుక్కి పాలు లేవని మా బాబుకి పాలు పట్టినప్పుడల్లా రెప్ప అర్పకుండా చూస్తుంది."

"బాగుందే! వసంతా! అది చూసినంత మాత్రన నీ కొడుక్కి దిష్టి తగిలి పాలు తాగడం మానేసాడంటావా? ఆకలి లేనప్పుడు నువ్వు పాలుపడితే ఎలా తాగుతాడు? నువ్వు దిష్టిపేరిట పారబోసిన పాలు దాని కొడుక్కే ఇచ్చి ఉంటే ఓ పూట వాడి ఆకలి తీరేదికదే! తన కొడుకు ఆకలి తీరినెందుకు ఎంతో సంతోషించేది సీతాలు. ఎదుటివారి ఆకలిని గమనించరే మీలాంటి వాళ్ళు! పైగా దిష్టి అంటారు" వసంత కళ్ళల్లోకి తీక్షణంగా చూస్తూ అంది మాలతి. వసంత ముఖం ప్రక్కకు త్రిప్పేసుకుంది. అక్కడ ఉండటం ఇష్టంలేక వెళ్ళిపోయింది మాలతి.

మాలతి మళ్ళీ వాసం వ్రాయడానికి ఉపక్రమించిది. తను ఆకలి గురించి వ్రాయడం ప్రారంభించిన దగ్గరనుంచి తనచుట్టూ ఉన్న ప్రతీ ప్రాణిలోని ఆకలని చూడగలిగింది. ఆకలికి అలమటించే ప్రాణాలెన్నో! తోటి మనిషి ఆకలి తీర్చవలసిన బాధ్యత ప్రతి మనిషికీ ఉంది. మరి దాన్ని

విస్మరించి మనిషి తన స్వార్థాన్నే చూచుకుంటాడు. వసంత లాంటి వాళ్ళంతా ఇటువంటి బాధ్యతను గుర్తిస్తే కొంత వరకైనా ఆకలి అంతరించిపోదా ? అనుకుంది మాలతి. ఆ విషయాలన్నే వ్యాసంలో ప్రస్తావించింది. ఐవా, దీనికి పూర్తి పరిష్కారానికి మార్గం ఏమిటా అని, మళ్ళీ అంతు దొరకని ఆలోచనల్లో పడింది మాలతి.

వనిత ( అగష్టు 1978 )

# ఉదయం

ఉదయకు మెలకువ వచ్చింది. కాని కళ్ళు తెరవాలనిపించలేదు. మనసంతా భారంగా ఉంది. ఇంకా ఎంతసేపైనా, కాదు ఎన్ని రోజులైనా నిద్రావస్థలోనే గడిచిపోతే బాగుండుననిపిస్తోంది. మెల్లగా కళ్ళు తెరచింది. బల్లమీద ఉన్న గడియారం ఏడు గంటలమీద ఇరవై నిమిషాలు చూపిస్తోంది. "బాగా తెల్లవారి పోయిందే" అనుకుంటూ పెరటి వైపు నడిచింది ఉదయ. ప్రతి రోజులాగే ఉదయ స్నానంచేసి వచ్చేసరికి, శాంతమ్మగారు కాఫీ, టిఫిన్ అందించారు ప్రేమగా. కాఫీ, టిఫిన్ తీసుకొని హాలులోకి వెళ్ళింది ఉదయ. మవునంగా టేబిలుమీద పెట్టింది.